
# అనుభవం

మాదిరెడ్డి సులోచన



అనుభవము నేర్పిన పాఠాలు ఏ కళాశాలలు నేర్పవని అంటారు. అది అక్షరాలా నిజం. జీవితం అంటే అమ్మా నాన్నలు కష్టపడి పంపిన డబ్బు ఖర్చు పెట్టటమేనని కొన్నాళ్లు అనుకున్నాను. అందముంది కాబట్టి అందానికి తగిన భార్య వస్తే ఆనందించటమే జీవితమని కొన్నాళ్లు అనుకున్నాను. అలాగే భారీ కట్నకానుకలతో, అందచందాల సంతరించుకున్న నా భార్య రేణు ఆనందపు లోతుల్ని చూపింది. నా భార్యను చూచాక నాకో బలమైన అభిప్రాయము ఏర్పడింది భార్య అనే పదానికి వ్యాఖ్యాత, మా రేణు. ఆమె నా సహాయము లేనిదే బ్రతుకలేదని తెలిపినప్పుడు నా ఆనందము ఇంతా అంతా కాదు. అందరి స్త్రీలలా కాదు మా రేణు. నేను కాకిని చూపి తెలుపు కదూ అంటే, "అవును." అంటుంది నాకన్నీ ఉన్నాయి. అనుభవము లేదని అన్నా వదినా అంటారు. వాళ్లకు మహా అనుభవము ఉన్నట్టు. నాకు కొన్ని మంచి గుణాలు కూడా ఉన్నాయి. నేను అందరికి సలహాలు ఇస్తాను. నా కెవరయినా సలహా ఇస్తే కోపము వస్తుంది. యెందుకంటే నేను మాట్లాడేదంతా హేతువాదంగా మాట్లాడుతానన్న నమ్మకము నాకు ఉంది. అప్పుడే నాకు బొంబేలో, హైద్రాబాద్‌లో ఒకే సారి ఉద్యోగం వచ్చింది.

"బొంబాయికే వెడతాను." అన్నాను

హైద్రాబాద్‌లో ఉండి బంధువుల బెడద, యెవరు భరిస్తారు?

"వద్దురా అక్కడ వచ్చిన జీతం ఇంటి అద్దెలకే చాలదు.'' అన్నాడు అన్నయ్య. నేను వినలేదు. వెళ్లేరోజు రేణు కంటనీరు పెట్టుకుంది. అలాంటి క్షణాలు నాకుచాలా అపురూపమయినవి. ఆమెను దగ్గరగా తీసుకుని ఓదార్చాను.

"వంద రూపాయలు ఇచ్చేదగ్గర మరో వంద ఇస్తే అదే దొరుకుతుంది డియర్. నువ్వు దిగులు పెట్టుకోకు." ఓదార్చాను. ఆమె దాదాపు ఏడ్చిందనే చెప్పాలి.

హోటల్ గదిలో సామానుపెట్టి నేను పనిచేయవలసిన కంపెనీకి వెళ్లాను. బాస్ నా వెంట వచ్చి అందరినీ పరిచయం చేశారు.


"ఇతను రవికాంత్ క్రొత్తగా వచ్చిన టి. టెక్... మిస్టర్ రవికాంత్, మిస్టర్ చక్రవర్తి - అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసరు, లియాకత్-హెడ్ క్లర్క్, ఆమె లత-నా పర్సనల్ సెక్రటరీ, కులకర్ణి స్టెనోగ్రాఫర్..." ఆఫీసు స్టాఫ్‌నంతా పరిచయం చేశారు. అక్కడ ఇంగ్లీషులోనే అందరితో మాట్లాడాలి. హిందీ కూడా అందరికి రాదు. రెండు రోజుల తరువాత కాస్త అందరితో చనువు ఏర్పడింది. చక్రవర్తి అందరితో చలోక్తిగా మాట్లాడుతూ తిరుగుతాడు. అతన్నే అడిగాను.

"యెక్కడయినా ఇల్లు దొరుకుతుందా?"

"అప్పుడేనా? వెళ్ళి ఏజెంట్లకు చెప్పాలి." అన్నాడు.

"బాబోయ్! హోటల్‌వాడు రోజుకు ఇరవై తీసుకుంటున్నాడు. మళ్ళీ భోజనానికి అదనంగా ఓ పది అవుతున్నాయి."

"మరి ఇది బొంబాయి." నవ్వాడు అతను. మరో నాల్గురోజులు ప్రయత్నం చేసినా ఇల్లు దొరుకుతుందన్న




ఆశలేదు. ఆ సాయంత్రము చక్రవర్తి పిలిచాడు. అతనిది యు. పి. అని తెలిసింది.

"కొన్నాళ్ళు మా అవస్త ఏదో మేం పడతాము. మా ఇంట్లో గదిలో ఉండు. ఇల్లు దొరికాక షిఫ్ట్ చేద్దువుగాని."

"అలాగే భోజనవసతి కూడా చూడాలి..." ఏమయితేనేం చక్రవర్తి ఇంట్లో నేను పేయింగ్ గెస్టుగా కుదిరాను. సుమన్, అతని భార్య చాలా కలుపుగోలు స్త్రీ. భర్త లేకపోయినా నాతో చనువుగా ఉండేది. వారి పిల్లలు టిల్లు, పింకి, నాతోనే ఆడుతుండేవారు. ఫ్లాట్ చిన్నదే అయినా నీటుగా అమర్చింది సుమన్. అవి చూచి ఆనందించబోయే సమయానికి అహం అడ్డువచ్చేది.

"ఈ ఉత్తరాది స్త్రీలకు నీతి నియమాలు ఏముంటాయి? ఇతరుల దగ్గర డబ్బు లాక్కోవాలనే నటన, నవ్వు," అనుకున్నాను. రాను, రాను నా అభిప్రాయము బలపడిపోయింది. వాళ్ల ఆప్యాయత నటనలాగ తోచింది. వారి ఆదరణ వెనుక ఏదో దురభిప్రాయమే ఉండి ఉంటుంది. నెలాఖరున డబ్బు ఇస్తుంటే నా కదోలా అనిపించింది. ఇంత డబ్బు హైద్రాబాద్‌లో అయితే ఓ మధ్యతరగతి ఉద్యోగి జీతము. చక్రవర్తి ఇంట్లో అన్ని వస్తువులు యెలా అమిరాయో అర్థం అయింది. అతను నాలాంటివారికి సహాయము చెయ్యటము వ్యాపార దృష్టితో చేస్తాడు అన్న అభిప్రాయము కల్గింది. మాలాంటివారి వల్లనేకదా మీరు ఇంత దర్జాగా బ్రతుకుతున్నారు. నిశ్చింతగా, నిర్భయంగా నాకు కావలసినవి అడగసాగేను. వారు నాకేం ఉపకారము చెయ్యటంలేదు. నావల్ల ఉపకారము పొందుతున్నారు. అదికాక మాటి,మాటికి ఇల్లు, రేణు గుర్తుకు వస్తున్నారు. తిండి సమస్య, ఉండే సమస్య తీరినా, ఒంటరితనము ఒక సమస్యగా మిగిలింది. రాత్రిళ్ల నిదుర పట్టేది కాదు. ప్రక్కగదిలో నవ్వు వినిపించినప్పుడల్లా నాకు అదోలా అయ్యేది. నా అసంతృప్తి వాళ్లదగ్గర ప్రదర్శించ సాగేను.

"మీ దాల్‌తో ప్రాణాలుతీస్తున్నారు. సాంబారు చేయటం రాదా?" అన్నాను. సుమన్ నవ్వింది, నొచ్చుకుందికూడాను.

"సారీ రవీ! రేపు మిసెస్ విశ్లేను అడిగి చేస్తాను. అలా ఫ్రాంక్‌గా అడగాలి" తలెత్తి చూదాను. సుమన్ నిజంగా ఆ మాట అంటుందా?

మర్నాటి నుండి, పప్పుతో పాటు సాంబారు ఉండేది. కొన్ని రోజులు పోయాక మరో కోర్కె బయలు పెట్టాను.

"వంటలు వండటములో మా దక్షిణాది స్త్రీలేనండీ, మీకు పిండి కలిపి పరోటాలు పిసికి వెయ్యటము వచ్చు..." అన్నాను వెటకారంగా. అయినా సుమన్ నొచ్చుకోలేదు.

"నిజమే, నేను ఇప్పుడిప్పుడే నేర్చుకుంటున్నాను. మా ఇంట్లో నేను చిన్నదాన్ని. పని చెయ్యనియ్యలేదు. వివాహము కాగానే, కొన్నాళ్ళు నేర్చుకున్నాను. ఇదిగో మేమున్నామంటూ టిల్లూ, పింకి పుట్టుకు వచ్చారు." అన్నది. ఆ తరువాత టిఫిన్‌కు వారు పరోటాలు తిన్నా, నా కోసము దోసె, ఇడ్లీ, వడ - పెసరట్టు చేసేది.

చక్రవర్తి, నేను ఫ్లాట్స్ చూస్తూనే ఉన్నాము. కొన్నింటికి అద్దె యెక్కువ. కొన్నింటికి పగిడీ కావాలి. అలాకాకుండా ఉంటే పెద్ద ఇల్లు అవుతుంది. అప్పుడే నాయర్ ఇల్లు సగమిస్తారన్న వార్త తెలిసింది. చక్రవర్తితో చెప్పాను.

"నాయర్ తల్లిని గూర్చి రకరకాలుగా చెబుతారు. ఆ ఇంట్లో ఉండేవారిని పీల్చి పిప్పి చేస్తుందట. చూద్దాం." అన్నాడు. ఆయన బాధ ఆయనది. అప్పనంగా వచ్చేడబ్బు యెందుకు వదులుకుంటాడు? మరోచోట ఇల్లుందంటే చూచి ఆలస్యంగా ఇంటికి వచ్చాను. చక్రవర్తి భార్యను ఏదో అంటున్నాడు. వినడము సభ్యత కాకపోయినా విన్నాను.

"మనిషికో రకం చేస్తూ, దినమంతా వంటింట్లోనే గడిపితే బాగుపడ్డట్టే. డాక్టర్ దగ్గర కెళ్ళమని మూడు రోజులుగా చెబుతున్నాను."

"రేపు వెళతాలెండి," అంటుంది. గదిలోకి బట్టలు మార్చుకుని, ముఖం కడిగి కూర్చున్నాను టిల్లు వచ్చాడు.

"అంకుల్ భోజనానికి రమ్మంటున్నారు...టిల్లు వెంటవెళ్ళాను. గోంగూర పచ్చడి, అప్పడాలు మాత్రం ఉన్నాయి. వారికి రొట్టెలు కూర, పప్పు స్పెషల్‌గా ఏం లేదు. అన్నం వండుతారు. పచ్చడి రుబ్బితే అరిగిపోయిందా ఈయన భార్య. ఆంధ్రుల మర్యాదలు చూపాలి వీడికి అనుకున్నాను. బల్లమీద దాదాపు ఆంధ్ర వంటకాలు ప్రత్యక్ష్యమయ్యేవి. రోజులు గడుస్తున్నాయి. రేణు ఉత్తరాలు వస్తున్నాయి. వాటి నిండా విరహ బాధనే! ఒకసారి ఉండబట్టలేక సుమన్‌తో చెప్పాను. "ఆవిడ సర్దుకో గల్గితే సరే పిలిపించు." అన్నది. అదే అదను అనుకుని రేణుకు ఉత్తరము వ్రాశాను.

ఆరోజు, జన్మలో మరిచిపోలేని రోజు! నా జీవిత పుటల్లో ఎఱ్ఱ గీతతో గుర్తుపెట్టిన రోజు! చక్రవర్తి పూనాలో సబ్ ఆఫీసుకు వెళ్లాడు. ఆఫీసు వాళ్లము ఇష్టరాజ్యంగా గడుపుతున్నాము. ఆరోజు టీ తాగుతున్నాము. లియాకత్ పకోడీలు తెచ్చి మా ముందుంచాడు. జీడిపప్పు వేసి చేసినవి చాలా రుచిగా ఉన్నాయి.

"యెక్కడ కొన్నావు? చాలా రుచిగా ఉన్నాయి." అడిగాను.

"ఆ పిసినారివాడు కొంటాడా? వాడి మహబూబా తెచ్చింది," కులకర్ణి చెప్పాడు.

"ఈజ్ ఇట్! యెవరా మహబూబా?"

"లతరా భాయి" అతను గర్వంగా నవ్వాడు లియాకత్.

"అదే రవికాంత్ భాయీ! ప్రేమించే కంటే ప్రేమించ బడటం అదృష్టంరా. తను ఆకలితో మాడుతూ వీడికి రకరకాల పిండివంటలు తెస్తుంది," అసూయగా అన్నాడు కులకర్ణి.

"అరే బడుద్దాయి. అదేరా ప్రేమ తత్వం, మనిషిలో మహత్యము. స్త్రీ ప్రేమించిన వాడికోసము ఏమయినా చేస్తుంది యెంత శ్రమ అయినా భరిస్తుంది," అన్నాడు. నవ్వుకుని పని చూచుకున్నాము. సాయంత్రం ఇంటికి వచ్చేసరికి సుమన్ పచ్చడి రుబ్బుతుంది. 'ప్రేమించిన పురుషుడి కోసము యెంత శ్రమయినా సహిస్తుంది!' ఆ! సుమన్ నన్ను ప్రేమిస్తుందా? అవును యెందుకు ప్రేమించదు! ఆమె నాకిష్టమయిన పిండి వంటలు చేసి పరోక్షంగా తెలిపింది. నేనే ఫూల్‌ని. గుర్తించలేక పోయాను. భార్యలు వేసే చాటుమాటు వేషాలు భర్తలకు తెలుసేమో! వారి ప్రోత్సాహము కూడా ఉండిఉంటుంది. లేకపోతే భార్యను ఒంటరిగా వదిలిపోయాడు. నేను ఏం చేసినా తప్పులేదు, మొగాడిని! ఇక నా భార్యకు తెలిస్తే పేచీ వస్తుంది. ఆమెకు తెలిసేది యెలా? సుమన్ ఇద్దరి బిడ్డల తల్లయినా వాడని పువ్వులా ఫ్రెష్‌గా ఉంటుంది.

భోజనాల దగ్గర కొసరి కొసరి వడ్డించింది.

"చక్రవర్తి లేడు, విసుగ్గా లేదా?" అడిగాను.

"మీరున్నారు, పిల్లలున్నారు. విసుగెందుకు?" అన్నది. ఆ 'మీరు' అన్న పదం నాకు ప్రత్యేకంగా కనిపించింది. నేను ఒక నిర్ణయానికి వచ్చాను. అది తలుచుకుంటే వెన్ను జలదరించింది. సన్నగా వణుకు ప్రారంభం అయింది.

లోపలి గిన్నెల చప్పుడు, పిల్లల చప్పుడు ఆగిపోయింది

"రవీ! హార్లిక్స్ త్రాగవా." లోపలి నుండే అడిగింది.

"వద్దు," అన్నాను. నా భావాలను ఇక్కడ టాస్ వేశాను. సుమన్ హార్లిక్స్ తెస్తే నన్ను కాంక్షిస్తుందని లెక్క. లేకపోతే... నేను ఆలోచిస్తుండగానే సుమన్ గ్లాసుతో గదిలో ప్రవేశించింది. ఆమె వంక చూచి పిచ్చివాడిని అయ్యాను. చేతులు లేని జాకెట్లోనుండి భుజాలు అందంగా కనిపిస్తున్నాయి. పిలం



వాయిల్ చీర ఆమె వంటికి యెంతగానో నప్పింది.

"మీ రేణుకు టెలిగ్రామివ్వాలి," అన్నది గ్లాసు ముందుకు చాచి.

గ్లాసు అందుకుని ప్రక్కన పెట్టి, ఆమె చెయ్యిపట్టి ముందుకు లాక్కున్నాను.

"రవీ!"

"అవును సుమన్, రవినే. నీ ప్రేమను ఆలస్యంగా గ్రహించాను." ఆవేశంతో ఆమెను హృదయానికి హత్తుకున్నాను.

"థ్యాంక్స్! నన్ను సరిగ్గా నిలబడని..." అన్నది. వదిలాను. అంతే! నా చెంప చెళ్లుమంది.

"ఒళ్ళు దగ్గర పెట్టుకో. చదువొక్కటే కాదు, సభ్యతా, సంస్కారాలు కూడా ఉండాలి." అన్నది. ఆ తరువాత కళ్లుతెరిచేసరికి ఆమె నా గది గొళ్లెం బయటపెట్టి వెళ్ళిపోయింది. ఆ రాత్రి యెలా గడిపానో ఆ భగవంతుడికే తెలుసు. మర్నాడు ఉదయం లేచాను. బయట తలుపు తీసే ఉంది. స్నానము చేసి బయటపడ్డాను. తిన్నగా సామాన్లు సర్దుకుని హైద్రాబాద్ వెళ్లాలి. చక్రవర్తికి కంపెనీలో యెంత పలుకుబడి ఉందో తెలుసు. సారిడాన్ వేసుకుని ఆఫీసుకు వెళ్లాను. మూడు గంటలప్పుడు చక్రవర్తి వచ్చాడు నా దగ్గరకు. నా శరీరమంతా కంపించసాగింది.

"ఏం ఒంట్లో బాగాలేదా?" అన్నాడు పరీక్షగా చూస్తూ.

"ఇంటికి వెళ్లారా?" అడగలేక అడగలేక అడిగాను.

''వెళ్లి భోజనము చేశాను. సుమన్ అన్నది 'అతని ఆరోగ్యము బాగా లేదని'...'' అన్నాడు. హృదయము మీదినుండి పెద్ద బండ తీసివేసినట్టుంది.

"ఏదో కాస్త తలనొప్పి," అన్నాను ధైర్యం కూడదీసుకుని.

"ఇదిగో, నీకు ఉత్తరం." ఇంటి దగ్గరనుండి తెచ్చాడు. విప్పి చదివాను. రేణు వస్తుంది... నా ముఖంలో మార్పులు గమనించాడేమో!

"అంతా క్షేమమేనా?"

"క్షేమమే. రేపే రేణు వస్తుంది. సాయంత్రము ఒకసారి వెళ్లి నాయర్

ఇల్లు యెవరూ తీసుకోకపోతే నేను తీసుకుంటాను."

"నీ ఇష్టం." అన్నాడు. సాయంత్రము వెళ్లాము యెవరూ రాలేదు. ఒక గది, వంటిల్లు, బాల్కనీఉన్నాయి. బాత్ రూమ్, లావెట్రి కామన్‌గా ఉన్నాయి. అడ్వాన్స్ ఇచ్చి వచ్చాము. ఇల్లు చేరుతుంటే సుమన్‌కు యెలా ముఖం చూపించాలో తెలియలేదు. మేం పైకి వెళ్లాము. పక్కింటామె తాళంచెవి ఇచ్చింది.

"పూనమ్ ఇంట్లో బర్త్‌డే పార్టీకి వెళ్లారు." అని చెప్పింది. అదే మంచి అదను అనుకుని సామాన్లు సర్దుకున్నాను. చక్రవర్తి ఆశ్చర్యంగా చూచాడు.

"మీరిద్దరు పోట్లాడుకున్నారా ఏం? సుమన్ ముభావంగానే జవాబుచెప్పింది."

"అదేం లేదు..." అన్నాను గాని అతను అంతా తెలిసే మాట్లాడుతున్నాడేమో.

"అమ్మాయి వచ్చాక రెండు రోజులు విశ్రాంతి తీసుకుని వేడితే..."

"మా రేణుకు సర్దుకుపోవడం అసలు తెలియదు."

"మరి అలాంటప్పుడు నాయర్ తల్లితో..."

"పరవాలేదు." అన్నాను. అతను యెంత చెప్పినా వినకుండా, బల్లమీదున్న భోజనము పూర్తిచేసి, టాక్సీని పిలిచాను.

"సుమన్‌ను రానియ్యి."

"మళ్లీ రానా, ఏమిటి?" అంటూనే సామాన్లు క్రిందికి తెచ్చాను. టాక్సీ కదిలాక తేలికగా ఊపిరి పీల్చుకున్నాను. ఆ తరువాత ఆ సంఘటన మరుగున పడింది. రేణుకు,అత్తకు ఊరు చూపాను. సామాన్లు కొని ఇల్లు సర్దుకున్నాము. చక్రవర్తి ఆహ్వానించాడు. మర్యాదలు వద్దని, వీలుచూచుకుని వస్తామని చెప్పాను. అత్త వెళ్లిపోయింది.

"అమ్మీ ఒక గ్లాసుతో కాఫీపొడి ఇస్తావుటమ్మా!" నాయర్ తల్లి రాజమ్మ అడిగింది.

"మేము నెస్ వాడుతాము," అన్నాను.

"అదే ఇవ్వు." అన్నది. ఆమె గ్లాసులో పొడి ఒంపేసరికి మా డబ్బా ఖాళీ అయింది. సాయంత్రము వచ్చి బయటికి వెడుతుండగా ప్రెషర్ కుక్కర్‌తో వచ్చిందామె."

"ఏమిటండీ?"

"గ్యాస్ అయిపోయింది. ఓ అర గంట వాడుతాను. మళ్లీ మీకు ఇస్తాను." అన్నది. వంటిల్లు వదిలేసి వెళ్లాము. అరగంట అన్నమాట మూడు రోజుల వరకు వెళ్లింది. మరో రోజు బజారుకు వెడుతున్నాను.

"అబ్బాయ్! బజారుకేనా?" యెదురు వచ్చింది రాజమ్మ.

"ఏం?"

"ఈ సామాన్లు తెచ్చిపెట్టు." లిస్ట్ ఇచ్చింది. డబ్బులడిగితే ఏం చిక్కో. అద్దెలో తీసుకోవచ్చని తెచ్చాను. అద్దె ఇచ్చేనాడు విషయము చెబితే నాయర్ యింతెత్తున యెగిరాడు. తల్లిచేసే అప్పులకు తన పూచీ లేదన్నాడు. ఆవిడను అడిగాను.

"మహాముష్టి రూపాయలకు గోల. ఇంత ఇల్లు దొరకాలంటే వెయ్యి రూపాయలయినా పగడీ ఇయ్యాలి," అన్నది.

బాత్‌రూమ్‌లో సబ్బులు, షాంపూ ఒకటేమిటి అన్ని మాయం చేస్తుంది. ఆవిడతో కచ్చితంగా లేదని చెబితే రేణును సాధించటము మొదలు పెట్టింది. వండిన అన్నము తినేవరకు నమ్మకం లేదు.

ఆ బాధ భరించలేక సింధీ కాలనీలో ఇల్లు ఖాళీ అయితే వెళ్లి వెనుకా ముందు ఆలోచించక అయిదు వందలు అడ్వాన్స్ ఇచ్చాను. నేను చెప్పానుగా నాకెవరి సలహా వినే అలవాటు లేదని.

"వచ్చే యెనిమిది వందల్లో అయిదు వందలు అద్దెకిచ్చి ఏం తింటాము?" రేణు గోలపెట్టింది. భార్య మాట వినటము యెంత నామర్దా!

"ఇక్కడ పద్ధతి అంతే రేణూ. కావాలంటే మనము పేయింగ్ గెస్ట్సుని తీసుకుందాము బోలెడు డబ్బు." అన్నాను. ఇంటినుండి వెయ్యి రూపాయలు తెప్పించాము. అడ్వాన్స్ తిరిగి ఇవ్వలేదు. అతనికి నెల ముందరగా చెప్పాలట. అక్కడ వదులుకుని,ఇక్కడ ఇస్తే నాజీతం ఏం సరిపోతుంది? మరో నెల గడిచింది. చక్రవర్తి క్షేమసమాచారాలు అడుగుతున్నాడుగాని రమ్మని పిలవలేదు. ఇద్దరు మహారాష్ట్రి యువకులు పేయింగ్ గెస్ట్సుగా దొరికారు. నాకు చాలా సంతోషంగా ఉంది.

"ఏమిటోనండీ, అందరికీ వంట అంటే మాటలా?" అన్నది రేణు.

"మనతోపాటు మరో ఇద్దరికి చెయ్యాలి, తప్పదు. లేకపోతే ప్రతి నెల ఇంటినుండి యెవరు పంపుతారు?" అడిగాను. అయిష్టంగా అంగీకరించింది.

నెల గడిచేసరికి పేయింగ్ గెస్టుల మీద సంపాదించే ఉబలాటం తీరిపోయింది. వాళ్ళకు మంచాలు, బల్ల కొనవలసి వచ్చింది. రేణుకు ఒక్క క్షణం తీరిక ఉండదు. సరదాకు ఒకటి రెండు గోధుమ రొట్టెలు ఆఫ్రికా, అమెరికా మ్యాపుల్లా చేసే రేణు, పూటకు పది రొట్టెలు చేయవలసి వస్తుంది. మాకు సాంబార్, వాళ్ళకి దాల్. విధిగా పచ్చి కూరగాయల సలాడ్ ఉండి తీరాలి. ఏదో ఓ రోజు ఈ జంజాటము వదిలి, సినిమా చూచి బయట భోజనము చెయ్యటానికి లేదు. స్నేహితులు పిలిచినా వీరికి వంటచేసి పోవాలి. ఒక బాధ్యతగా పరిణమించింది. పైగా జమాఖర్చులు చూస్తే చేతి సమురే వదిలింది.

"మీ ఆంధ్రులు తీపి పదార్థాలు



తినరా?" ఒకరోజు గోల్కర్ అడిగాడు. నాకు చిర్రెత్తుకొచ్చింది. వీడికి అన్నం పెట్టేదే గొప్పంటే! బలవంతంగా నవ్వాను.

"నా మిసెస్‌కు రావు." నాహృదయము కదిలిపోయింది. నేను యెంత అధికారంగా సుమన్‌ను అడిగేవాడిని!

"వదినవంట తింటుంటే ఆటోమాటిక్ డయటింగ్!" మరోరోజు అనురూప్ నవ్వాడు. నా ఒళ్లంతా భారం రాచుకున్నట్టు అయింది. ఆఫీసులో లియాకత్ గొడవ యెక్కువయింది.

"టీ బీ వచ్చిందిగా! మనవాడు రాత్రిళ్ళు నిదుర తరిచిపోయాడులా ఉంది కళ్ళక్రింద వలయాలు చూడు."

"నిజమేనుట్రా భాయి!" కులకర్ణి అడిగాడు. పేలవంగా నవ్వాను. అంతకంటే ఏమి చేయగలను. ఒకొకసారి తొమ్మిదింటికే అలసి నా భార్య నిదరపోతుందని చెప్పనా?

ఊహలు ఊరిస్తాయి. అపోహలు అందమైనవిగా కనిపిస్తాయి. అనుభవము యెంత వాస్తవమయినది! యెంత గొప్పది! చక్రవర్తిని చూడాలంటే ముఖం చెల్లటంలేదు. దానికితోడు ఆయనకు టూర్లు యెక్కువయ్యాయి. అతనితో మనసు విప్పి మాట్లాడనిదే బ్రతుకలేనేమో అనిపించింది.

ఆ రోజు ఆదివారం, ఏడింటికి మేల్కొని ప్రక్కకుచూస్తే రేణుఎప్పుడో లేచిపోయింది. రాత్రి అనురూప్ చెప్పిన విషయము గుర్తుకు వచ్చింది.

"వదినా! రేపు ఆఫీసులో పనిఉంది. యెనిమిది గంటలకల్లా వంటయిపోవాలి." అన్నాడు. కొందరు మొదటే మాట్లాడుతారట, సెలవు దినాలలో అర్జంటు పనిఉంటే బయట భోజనము చేయాలని. మరికొందరు మర్యాదకోసం అడగరట. మహారాష్ట్రీలు కార్యవాదులు. ఒక్కపైసా ఇతరత్రా ఖర్చు పెట్టుకోరు. ఛీ, ఈ గోల లేకపోతే హాయిగా ఇద్దరము పడుకునేవారము.

మా స్వేచ్ఛ యెంతగా అరికట్టబడిందో తెలిసిపోయింది. లేచి వంటింట్లోకివెళ్లాను. అనురూప్ పూరీలు ఒత్తుతున్నాడు. రేణు వేయిస్తుంది. ఇద్దరు ఒకరిని, ఒకరు అనుకుని ఉన్నట్టే ఉన్నారు. అతనేం అన్నాడో రేణు పక పక నవ్వింది. నా హృదయాన్నెవరో గట్టిగా పిండినట్టు ఫీలయ్యాను. ఏమనలేక బాత్‌రూమ్‌కెళ్ళి ముఖం కడుక్కొనివచ్చేసరికి, అనురూప్ భోజనము చేస్తున్నాడు. అతని యెదురుగా కూర్చుని వడ్డిస్తుంది రేణు. నాకు పుండుమీద కారం చల్లినట్టు అనిపించింది. ''రేణూ!'' కోపంగా పిలిచాను. ఆమె వచ్చింది.

"ఆ వెధవతో ఏమిటా వికవికలు, పకపకలు!"

ఆమె కళ్లు పత్తికాయలే అయ్యాయి. వెంటనే నీటితో నిండాయి.

''ఏమన్నారు?'' వణికిపోయింది. "పాపం! రాత్రి సరిగ్గా తినలేదని వడ్డించబోయాను.''

"వడ్డించేది తరువాత, ముందు నవ్వలే?" నిలదీశాను.

"ఆఁ... అతను తను వండుకునేటప్పుడు అయన అనుభవాలు చెప్పాడు. మిరపకాయల కూరలో కారంవేసి వండినట్టు చెబితే నవ్వాను. ఛీ...ఛీ ..." ఆమె కళ్ళు ఒత్తుకుని వెళ్ళింది. రెండు రోజులు ముఖం మాడ్చుకుంది. రేణుకు చెడుఉద్దేశము లేకపోవచ్చు. అవతలివారు చనువును అర్థం చేసుకునే సంస్కారవంతులో కాదో? 'అంతా నీలాంటి సంకుచిత స్వభావులే ఉంటారా?' అని నా అంతరాత్మ ప్రశ్నించింది. ఆత్మ పరిశీలనతో హృదయము తేలికయింది. ఆనందంగా ఇంటికి వచ్చాను. రేణు శరీరములో ఓపిక లేనట్టు పడుకుంది.

"రేణూ!" ఆదుర్దాగా నుదురు తాకి చూచాను.

"భయము లేదు. మిఠాయి కావాలి.'' గోల్కర్ నవ్వాడు.

''నువ్వు ఆఫీసుకు పోలేదా?''

"తయారయ్యాను. వదిన మూల్గు వినిపించింది. డాక్టర్‌ను తీసుకువచ్చాను. షి ఈజ్ ఇన్ ఫ్యామిలి వే..."

"ఈజ్ ఇట్!" నా సంతోషం, ఇంతా అంతా కాదు. ఆనందంగా రేణును ఒడిలోకి తీసుకోబోయి, సభ్యత అడ్డు వచ్చింది. ఆగాను.

"రెండేసి గంటలకు టాబ్లెట్టు, పండ్లరసము ఇవ్వమన్నాడు. నీకు ఫోన్‌చేసి నువ్వు వచ్చేసరికి సగం దినము వేస్టు అని చేయలేదు.'' అతని మాటలు చెళ్ళున తగిలాయి. మా కోసం యెందుకతను ఆదుర్దాపడాలి? ఒకరోజు సెలవెందుకు పెట్టాలి? డబ్బుకు అతీతమయిన బంధమేదో ఉంది. సుమన్‌ను, చక్రవర్తిని యెంత అపార్థం చేసుకున్నాను!

"ఏమండీ! అతన్ని యెంత వారించినా వినలేదు." సంజాయిషీ ఇచ్చింది రేణు. గోల్కర్ వెళ్ళిపోయాడు. అతను టీ కాచుకుని వచ్చాడు. నా కళ్లకున్న పొరలు పూర్తిగా తొలగిపోయాయి. 'నేను' అనే అహం పూర్తిగా కరిగిపోయింది. గోల్కర్ వెళ్ళిపోగానే రేణును హృదయానికి హత్తుకున్నాను.

'సారీ! రేణూ...నేను నువ్వూహించినంత మూర్ఖుడిని కాను..." అన్నాను. ఆ తరువాత రేణు పరిస్థితిచూచి వాళ్ళే వేరే ఏర్పాటు చేసుకున్నారు. నాకు పెద్ద బరువు దింపినట్టు అయింది. రేణు లేచి తిరుగుతున్నా బలహీనంగా ఉంది. ఆమెను ఇంట్లో వదిలి చెంబూర్ ఫ్లాట్స్‌కు వెళ్లాను. నా పొరపాటును మన్నించమని హృదయపూర్వకంగా కోరాను. సుమన్ అదే చిరునవ్వుతో మాట్లాడింది. దాన్నిబట్టి ఆమె క్షమించిందని అనుకున్నాను.

"ఒదినా, మరిదికి రాజీ కుదిరిందన్నమాట. మీ మిస్టరీ అర్థంకాక చచ్చాననుకో..." చక్రవర్తి వచ్చాడు.

"అది సరే. తొందరగా తయారవ్వండి. ఈయనగారి బెటర్‌హాఫ్‌ను చూచి, పార్టీ తీసుకుందాము." సుమన్ గలగల మాట్లాడేస్తుంది. రేణు గర్భవతి అని విని చక్రవర్తి అభినందించాడు.

"అంకుల్! ఊరికి వెళ్లావా?'' టిల్లు అడిగాడు, అమాయకంగా.

"ఊఁ...'' అన్నాను. అనుభవం యెంత విలువయినది!

పదే పదే అనుకున్నాను. అమృతము హాలాహలం అయ్యేది అనుకున్నాను. వాళ్ళు తయారవుతున్నారు. నేను తేలికపడ్డ మనసుతో ఉత్సాహంగా టిల్లుతో కబుర్లు చెప్పసాగేను.

